# SRI KRISHNA VILASAMU

## (YAKSHA GANA)

BY


VIJAYARAGHAVA NAYAKA

KING OF TANJORE (1633–73)


*Edited by:*


SRI V. SUNDARA SARMA,

*Pandit, Saraswathi Mahal Library, Tanjore.*



*Published by:*

Sri S. GOPALAN, B.A., B.L.,

*Honorary Secretary, T. M. S. S. M. Library,*

*Tanjore.*

1956

Price 6 Annas.

# తొలిపలుకు

తంజావూరు సరస్వతీమహాలు గ్రంథాలయమునుండి వివిధవిభాగములలో వెలువడు ఆంధ్రగ్రంథములలో నీ శ్రీకృష్ణవిలాసము కూడ నొకటి యగును. ఇయ్యది తంజాపురాంధ్రనాయకరాజశిఖామణియు, విద్వత్కవియు, కవిజనాశ్రయుఁడును, నాంధ్రభాషామతల్లి కనర్ఘ్య గ్రంథకుసుమాంజలి నర్పించి యనితరసాధారణ విఖ్యాతి నంది ధన్యచరితుండైన విజయరాఘవనాయకునిచే విరచింపఁబడినది. అతనిచే రచింపఁబడిన ప్రహ్లాదచరిత్ర మను యక్షగానమున నతని కృతులను వివరించు సీసమాలికలో నీ కృష్ణవిలాసము గూడ నంతర్భూతమై యున్నది. కాని చాలకాలముగ నీ గ్రంథము కనుగొనబడకయే యుండినది. సమీపకాలముననే యీ గ్రంథము వెలుఁగుఁ జూచినది. తంజాపురాంధ్రనాయకరాజుల కాలమునాటి యాంధ్రభాషాభివృద్ధ్యాది సకలవిషయము లీవఱకు ఈ గ్రంథాలయమునుండి వెలువడిన యాంధ్రగ్రంథములందును విశేషించి శ్రీయుత నిడుదవోలు వెంకటరావు M.A., గారి "దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము" (The Southern School in Telugu Literature) అను గ్రంథమునందును విపులముగ చర్చింపఁబడియున్నది. అద్దాని నిచట మరల వ్రాయుట చర్వితచర్వణమే కాగలదు.

ఈ శ్రీకృష్ణవిలాస మను నభినయరూపకమునందు శ్రీకృష్ణుఁడు శ్రీరుక్మిణీదేవితో గూడి సరససల్లాపములతో విహరించుట నెఱిఁగిన సత్యభామ విరహవేదనాదోదూయమానమానసయై శ్రీకృష్ణునివద్దికి దూతిక నంపుట, శ్రీకృష్ణుఁడు సత్యాన్వేషియై వచ్చుట, సత్య ప్రణయకోపము నటించుట, సత్యభామాసాంత్వనము మొదలగు విషయము లత్యంత మనోహరముగ వర్ణితములు.

ఈ పొత్త మాంధ్రపాఠకలోకము యొక్క యాదరాభిమానములకు పాత్రము కాఁగలదని నమ్ముచున్నాను.

సరస్వతీమహాల్ గ్రంథాలయము,
తంజావూరు,
28-4-56

విఠలదేవుని సుందరశర్మ

శ్రీరస్తు.

శుభమస్తు.

# శ్రీ కృష్ణవిలాసము

## (యక్షగానము)

## విజయరాఘవనాయక విరచితము

* సీ. భోజకన్యాముఖాంభోజరాజమరాళ! - సత్యాఘనస్తనస్తబకభృంగ!
జాంబవతీ విలోచనచకోరశశాంక! - మిత్రవిందాతటిన్మేఘ రూప!
భద్రావశావశాభద్రదంతావళ! - వరసుదంతామనోవనమృగేంద్ర!
లక్షణారూపకలాపినీపర్జన్య! భానుసుతాలతాపారిజాత!

తే. గీ. షోడశస్త్రీసహస్రచక్షుఃప్రసార - హారసారమసారమోహనశరీర!
విజయరాఘవభూపాలభజనలోల! - కేలు మోడ్చెద రాజగోపాల! నీకు.

కైవారము. శ్రీరాజగోపాల! చెంగమలాంబికాలోల! హరిద్రసరిద్రమణీయమణివిశంకట
తటీనికటపటీరవిటపికుటీరవిహార! క్షీరసాగరపారాభిరామనిరుపారామసరామ
సంచారాలంకార! ఓ చెండలంకార! పరాకు! స్వామి! పరాకు!

వ. అని వెండియు నే మని కొనియాడుచున్నాఁడు.

ద్వి. శ్రీరాజగోపాల! శిశుపాలఫాల! - నీరధరశ్యామ! నిరుపమధామ!
పురుహూతసుతవంద్య! భువనాభినంద్య! - కరలసన్మణివేత్ర! కమనీయగాత్ర!

---

* ఈ పద్యము మాతృకలో లేదు. కాని, విజయరాఘవనాయకుని కృతు లన్నిటియందును పై పద్య మనుసూత్యముగ వచ్చుచుండుటచే నాతని కృతియగు నీ గ్రంథమునఁ గూడ నాపద్యము గ్రంథాదిపద్యముగా జేర్పఁబడినది.

నందమందిరబాల ! నమదరిజాల ! - ఇందిరారతిలోల ! ఏకాంతలీల !
వెన్నుండ ! పాండవవేదిసదస్య ! - మన్నారుదాసనామకముపాస్య !
నినుఁ గొనియాడఁగా నేనెంతవాఁడ - కనకవనీశ ! నీకరుణచే నేను
సరసగుణకదంబ సజ్జనాలంబ - అరుణసరోజాంబ యచలనితంబఁ
దలఁపున నుంచి మాతాతార్యుఁ గొలిచి - యలరు ప్రాచేతసవ్యాసులఁ దలఁచి
భారతీనేతను బ్రార్థన చేసి - శారదాదేవి కంజలి సంఘటించి
కనకసరోజాంబికాస్తన్యపాన - జనితసారస్వతసారతమీరి
సకలసత్కవికోటి సంతసం బంద - నొకనాట రచియింతు నొక నాటకంబు.

వ. అని యిష్టదేవతాభివందనంబును విశిష్టజనాభినందనంబునుం గావించి లోకంబు మెచ్చ నచ్చుత విజయరాఘవసార్వభౌముండు హవణించిన కృతముఖముఖోల్లాసం బగు కృష్ణవిలాసం బను నాటకంబునకుఁ గథాసంవిధానం బెటువలెను.

దరువు—సౌరాష్ట్ర—ఆదితాళము.

వెలఁదురు వెయ్యారులు వెంట నంటి కొలువఁగా - నలరువిల్తునిరీతి నలరుచును
మలయుచు సొలయుచు మన్నారుదేవుండు - కొలువుకూటము జేరె చెలువము మీర.

వ. ఇవ్విధంబున నవ్విహంగపుంగవతురంగుండు మెఱుంగుఁబోఁడులు కురంగటఁ గొలువ గొలువై యుండె నట యెటువలెను.

ద్వి. హరువుగ నొకయింతి యడపంబు పూన - సరగునఁ గాళాంజి సఖి దాల్చ నొకతె
కేల నొక్క లతాంగి గిండి వహింప - బాలిక యొక్కతె పావడ వైవఁ
గాంచనగాత్రి యొక్కతె కుంచె పూన - మించుఁబోణి యొకర్తు హెచ్చరి కనఁగ
పగలాఁడి జోడుకైవారము సేయ - దగవు గమ్మని యొక్క ధవళాక్షి దెలుప
హత్తి యొకానొక యలివీలవేణి - యుత్తరమునకుఁ బ్రత్యుత్తర మియ్య
[1]బాహుమూలరుచులు బయలుగా నొకతె - యూహించి నెరికురుల్ హాయిలుగా దిద్ద
వలపించఁ బోయొక్క వనజాక్షి తానె - వలరాచసివ మెత్తి వదరుచు నుండ
మందయాన యొకర్తు మఱియొక్క సతికి - సందిట్క్రొన్నెలల్ సైగల జూప
రామ యొక్కతె ఘనరాగవైఖరులు - లేమ యొక్కతె శ్రుతి లియ్యపు వరుస

1. బాహుమూలరుచుల్

చామ యొక్కతె పూర్వసంకీర్తనంబు - భామ యొక్కతె [1]మరుపదముల వింత రంజిల్ల వినుపింప రాజమన్నారు - సంజాతమానసోత్సాహుండై యుండె.

వ. ఆసమయంబున మురారిసముఖంబునకు బరాబరి వచ్చె నట యెటువలెను.

దరువు - శంకరాభరణం - ఆది.

బచ్చెనకోల చేఁ బూని బరాబరి వేగ - వచ్చెను మన్ననారువద్దికి నిపుడు

వ. ఇవ్విధంబున వచ్చిన యామచ్చెకంటి యచ్చుతుని సమ్ముఖమ్మునకు విలాసవతిని రప్పించంగా నెచ్చెలి వచ్చె నట యెటువలెకు.

దరువు - ముఖారి - ఆది.

మన్నారుకొలువుకు విన్నాణ మమరఁగా - వన్నెలాడి విలాసవతి చేరవచ్చె.

వ. ఇవ్విధంబున వచ్చిన యాజవ్వని చక్కెర విల్తునిం గన్నయ్యకు మొక్కె నట యెటువలెను,

దరువు - సావేరి - అటతాళం.

తరుణార్కసంకాశ ! దళితకారుశ ! - సల్లాము సల్లామయా 1

అరుణాబ్జదేవీశ ! అతులప్రకాశ ! - సల్లాము సల్లామయా. 2

వ. అని సలాముసేసి యా విలాసవతి యనుపదంబ పదకేళిక వినుపించె నట యేటువలెను,

రేవగుప్తి - ఆది.

పల్లవి. చూచేవురా నీవే చూచేవు - ఓచెల్వమన్నారు ! నాచెల్లుబడికి

పదం. ఎచ్చుమానిసివి లేర ఓరోరి ! మన్న ! - యేమో యని యుంటిర
గచ్చులు నాతోనె పోర - ముచ్చుకె మూరెఁడు నోరా. 1

ఏవేళను నామీఁదనె కంటూ ఆ - యింతితో నన్నాడుకొంటూ
భావజుఁడు జేసిన జంటూ - పాయజేసే నంటూ. 2

జూజమున నున్న గూడి - జోడుబాయ నని నిలువనాడి
రాజమన్న ! యేచేది పాడి నీ - నైజము యిటువంటి మోడి. 3

1. దరు ?

వ. ఆ సమయంబున నాయంబుజాక్షుఁ డాకంబుకంఠిని తాంబూలజాంబూనదాంబరకదంబకంబుల బహూకరించువేళ నాగోపాలునిపాలికి భోజరాజన్యకన్యకాజన్య వచ్చె నట యెటువలెను.

దరువు - పంతువరాళి - ఆది.

పూలబంతి చేఁ బూని పూఁబోణి యొకతె - బాలగోపాలునిపాలికి వచ్చె

వ. ఇవ్విధంబున వచ్చిన పువ్వుఁబోణి యా వల్లవీవల్లభునకు సల్లాము సేసె నట యెటువలెను.

దరువు - కాంభోది - ఆది.

రమణీయగుణశీల ! రాజగోపాల ! - మొక్కేను మొక్కేనయా. 1

విమలకాంచనచేల ! విమతవిభాళ ! - మొక్కేను మొక్కేనయా. 2

వ. ఈరీతి వచ్చిన నారీతిలకంబు తనరాక విన్నవింప నానీరాకరశాయి యేమనుచున్నాఁడు.

పద్యం.

క. ఇదె వచ్చెదము హరిద్రా - నదిచెంగట మించు కాంచవనంబున కా
మదవతి నటుఁ దోడ్కొనిరాఁ - గదవే ! తామసము సేయక చెలీ ! పదవే.

వ. అని పలికి యాకలికిని బంచిన యనంతరకథాసంవిధానం బెటువలెను.

దరువు—కేదారగౌళ—ఆది.

వాలుగొప్పున జాజిపూలు హాయిలుమీర - మేళవించి కిన్నెర మీటుచు మన్నని
యేలలు బాడుచు నెదురెదురె జూచుచు - బాలామణి రుక్మిణి కేళీవనము జేరె.

వ. ఆ సమయంబున రాసకేళీవిహారిసమ్ముఖంబుననుండి సమ్మదంబున వచ్చిన యా నెచ్చెలి యచ్చుతుని పట్టంపురాణితో నేమనుచున్నది.

దరువు—కల్యాణి—అటతాళం.

మన సిచ్చి రమ్మనె నమ్మ ! - మనసిజగురుఁడైన మన్నారు లెమ్మ. 1

నిజముగ మాటాడె నేఁడు - విజయరాఘవు నేలు వేల్పుల రేఁడు. 2

సవతులలో నెల్ల నీకు - సవతు లేకుండాను సాదించె వాకు. 3

మునుపటి మననారు గాఁడే ఓ - వనిత! యెంతయు మంచివాఁడై నాఁడే. 4

కంతుకేళి తోఁపు తావె ఓ - కాంతరో! వేగ శింగారించుకోవే. 5

వ. అనిన విని యా వనితామణి తనకు నెనరైన చెలులతో నే మనుచున్నది.

ద్వి. తెలివరో! ఎలద్రాక్ష దీవెల ద్రిప్ప - పరువంపు మరువంపు పొదు బైలాను
గందంపుమానుల ఘనసారతరుల - కందంబుగా కొమ్మ లమరించు కొమ్మ
గుజ్జుమావులఁ దేఁటిగుంపుల దోలి - గొజ్జంగిపొదరిల్లు కొమ్మ ఘటించు
మగరాల నిగరాల మగటిమి దాల్పు - జిగిమించు కెంపురాచికిలికుచ్చులను
వెలయు రేరారాల వేదికయందు - అలరుల పానుపు హావణింపు మనుచు
కట్టాణిముత్యాల కమ్మలజోడు - చుట్టుగరంబులు సొగసుగాజులును
కంటసరంబులు కంటమాలికలు - గంటలమొలనూలు గొళసరంబు
లాదిగాఁ గల సొమ్ము లాభోజకన్య - మోదమున ధరించి మురియుచు నుండె.

వ. ఆ సమయంబున సంపంగిమన్నారు సమ్ముఖమ్మున సాత్రాజిత్తనూజాత దూతిక వచ్చె
నట యెటువలెను.

దరువు—సావేరి—ఆది.

విరులచెండ్లు బూని విరిఁబోణి యొక్కతె - హరిసముఖమునకు దురుసుగ వచ్చె.

వ. ఇత్తెఱంగున వచ్చిన మెఱుంగుఁబోణి యేమనుచున్నది.

పద్యం.

క. దేవర యిచ్చిన పందెము - నీవలె నని యెచ్చరింపవే యనుచుఁ స
త్యావనిత బంప వచ్చితి - గోవర్ధనధారి! రాజగోపాల! హరీ!

వ. అనిన విని కనకవనీవిహారి యా మిటారితో నే మనుచున్నాఁడు.

పద్యం.

క. కనకాంగి! మానినీమణి! - కనికరమున సత్య పంపఁగా వచ్చితివా
వనజేక్షణ! వచ్చెద మటు - మును కలఁగఁగ నచట జేరి ముదితకు జెపుమా.

వ. అని మందలించి యామించుఁబోణిని బంచి యుల్లంబు బల్లవింప రతిసమయసముచిత శృంగారంబు బొంగార భోజరాజతనూజభవనరాజంబునకు రాఁగోరి బయలుదేరి సూనశరగురుండు బయలుజిమ్ముచు హొయలుమీరుచు కేకవేయుచు రాకజూపుచు మలయుచు సొలయుచు మారులేని వీరాధివీరుండై చేరవచ్చె నట యెటువలెను.

దరువు - ఘంటారవం - ఆది.

ఆరజపుశింగార మమర గనుపట్ట - ఆరాజమన్నారు అందముగ వచ్చె.

వ. ఈ చందంబున దనమందిరంబునకు వచ్చిన కందర్పగురుని కాయిందువదన యెదురుగా వచ్చె నట యెటువలెను.

దరువు—నాదనామక్రియ—ఆది.

చెలువము మీరఁగా చెలువమన్నారుకు - నెలమితో రుక్మిణి యెదురుగా వచ్చె.

వ. ఇవ్విధంబున వచ్చిన యా వేదండగమన వేదండవరదునికి గైదండ యొసఁగి మురువుగా జఱునవ్వు నవ్వి మేనుమేను జేర్చి గారవించి మించి కాంచనభద్రపీఠంబుననుంచి నెత్తమాడఁ దలంచు చిత్తజగురుని చిత్తవృత్తి దెలిసి కనుసన్న సేయ నొక మగువ పగడసారెలు దెచ్చె నట యెటువలెను.

దరువు—ఆహిరి—జంపెతాళం.

చొక్కమా గుజరాతి కెంపుల - సొగసైన కిరీటిపచ్చల
నెక్కుడై కనుపించు మగరా లింద్రనీలముల -
చెక్కడపు పనిచేత దీరిన జీనిబంగరు పగడసారెలు
నొక్క చెలి గొనివచ్చి - చెంగట నొడ్డె నపుడు.

వ. ఆ సమయంబున నిద్దఱు ముద్దుగుమ్మలు వద్దజేరి యొద్దికమై యెత్తులు దెలుపఁ దాఁచు పెన్నుద్దులై ద్యూతకేళీసన్నద్ధులై భోజకన్యారాజగోపాలకులు పరస్పరవచన రచనలు మెఱయ హరువుగా సారెలు నడపి రట యెటువలెను.

పదం—కాంబోది—అటతాళం.

పచ్చసారెకే ఓరి! రచ్చసేసేవుగా - హెచ్చుపందెము లాడి నన్నెదుర గలవా,
పచ్చసారెనే నిన్ను పచరించి గెలిచితే నీ - పచ్చ కప్పురవిడెము బాలించే వేమే. 1

పల్లవి.

చక్కని మన్న! నే గెల్చిన సమరతి నేలేవా ని
న్నొక్క యెత్తున గెల్చే గాని యుపరతి సలిపేవా.

వ. అని పలుకుచు చిలుకలకొలికియు నాకలికిగోపాలుండు వేడుకతోడ జోడుగూడి సొక్కి సొక్కించి సొలసి సొలయించి వలచి వలపించి దక్కితిని చిక్కితి నని మైమఱపించి దయ బలియించి పెనంగి యనంగసామ్రాజ్యం బేలించి తేలించి లాలించిన వగ లెల్ల నాతెగమగువ విన్నవింపకమున్నె శకునపరంపరలవలన యా నీలవర్ణుని దుర్ణయంబు నిర్ణయించి విత్రస్తచిత్తయై సత్రాజిత్తనూజ చిరసమయవిరహజనితమదన వేదనాదోధూయమానమానసయై నిలిచినచోట నిలువక కళవళింపుచుఁ దడబడుచు నుడిగంపుపడుచులపైఁ జిడిముడిబడుచుఁ బడకిల్లు వెడలి చెలువుమీరు కొలువు కూటముఁ జేరవచ్చె నట యెటువలెను.

దరువు—కాంభోడి—ఏకతాళి.

పదముల తడబాటు యెద జారుపయ్యెద నీటు - వదలబారెడు నీవి వాడిన మోవి
చెదరిన కస్తూరి రేక చెలువొంద తనవీఁక - సుదతి సత్యభామ సొలయుచు వచ్చె.

వ. ఇత్తెఱంగునఁ జేరి యత్తలోదరి చిత్తజకరోన్ముక్తశరోన్మత్తచిత్తయై కన్నులఁ గనుఁ గొన్నరీతిఁ జెన్నారు మన్నారును గుఱించి సైరించరాని విరహంబున నే మనుచున్నది.

కల్యాణి—తెగదమానం.

పల్లవి.

రారా రాజగోపాల! నీకు మొక్కెర - యేరా మోహనాకార!

పదం.

కంటికి నిదుర రాదాయెఁ గాముండు పగదాయ - నొంటి నుండఁగలేర ఓ ధీర!
ఇంటికి వచ్చి యీవేళ నెలమి సేయవేల? ని - న్నంటియున్న వాలుగంటి యెట్లాతాళు 1
వెన్నెల వేఁడాయె విరహ మగ్గలమాయెఁ - గ్రొన్నన వాఁడాయె నిన్నెడబాయ
కన్నులవిలుకాఁడు కాంతాళించియున్నాఁడు నా - కన్న లాన నేను కల్లలాడ లేను. 2
సన్నజాజుల శయ్య సారెకు లక్ష శయ్య - మన్ననతోఁగూడి మన్నారు! మగుడి
కన్నళవి నేసేది కాదురా నీ కిది - వన్నెకాఁడ! చాలా వాదుసేయ మేలా. 3

వ. అని యా హంసగమన కంసదమనుని దూతి యా శౌరిదండనుండి తా నొంటిగా వచ్చిన వాలుగంటినిం జూచి యఖండిత రోషాతి రేకంబున ఖండితానాయికయై వచ్చె నట యెటువలెను.

దరువు.

కౌ నసియాడఁగా కన్నుల కెంప లరఁగా - మేన పులుకలూర మిసిమి పయ్యెద జార
వీనుల కమ్మ లల్లాడ వెన్నుని విడనాడి - బూని సత్యభామ మానిని వచ్చె.

వ. ఇవ్విధంబున వచ్చి యచ్యుతుని చెంతనుండి వచ్చిన నెచ్చెలినిం జూచి యేమనుచున్నది.

దరువు—కేదారగౌళ—జంపెతాళం.

(సత్య): సుదతి! నీ వటు జేరితే శౌరితో సుద్దు లాడిటు వచ్చితే - ఓయమ్మ!
(సఖి): మదవతిరో! మదనగురుఁ డారుక్మిణి మందిరంబున దూరెనే. 1

(సత్య): జూజమాడిన సుద్దు లా నవనీతచోరునికి తెలియించితే - ఓయమ్మ!
(సఖి): రాజముఖి! మన్ననారు జూజంబు నైజంబుసేసె గదవే. 2

(సత్య): ఎరుకసేసిన మీద నాయెలనాగ యింటిచాయకు బోయెనా - ఓయమ్మ!
(సఖి): తరుణి! యిటకై వచ్చి యా తరళాక్షి వరుస యని యటు జారెనే. 3

(సత్య): ఉవిద! చూచేవు నీవు వాఁడు నాయెద్ది కెటువలె వచ్చును - ఓయమ్మ!
(సఖి): ధవళాక్షి! వాని మోమాయలకును తగిలి యూరక యుందువే. 4

(సత్య): లలన! పంతము జూడవే కాళ్లవేళ్లను పెనఁగినను జూడనే - ఓయమ్మ!
(సఖి): మలయజగంధి! వాని జూచితే మనసుకోపము నిలువదే. 5

వ. అని మఱియు నేమనుచున్నది.

దరువు—గుమ్మకాంభోది—ఏకతాళి

బంటువలె నిచ్చకము పలుకేవాఁడు దాని - యింటికి బోయె నని వింటినమ్మ!
జంటబాయఁ డని నే యుంటినమ్మ! మచ్చె - కంటి వానివగలు నే గంటినమ్మ! 1

వ. ఇవ్విధంబున బలికి యాకలికి ప్రళయసమయసముజ్జృంభమాణమహాప్రకృతిరీతి భ్రుకుటి ఘటించి చిటపటాయించి కోపాటోపంబు(న) మాటలేక [1]యేధమానసయై క్రోధా

1. "వ్యథమాన" అని యుండ నోపు.

గారంబుఁజేరి తలఁపు దాఁచి తలపు [1]వైచి చెలువల రోసి చలువల బాసి చలపట్టినట్టు యున్న సమయంబున నసమశరగురుండు సాత్రాజితీసతీసఖి తనదండ నుండకున్నఁ జూచి యళికి ఝుళుకెత్తి మనసు కలంగి చరియించి వెలవెలనై కళవళపడి యామచ్చె కంటి యున్న యచ్చోటికి ముచ్చువలె వచ్చె నట యెటువలెను.

దరువు—బిలహరి—అటతాళం.

అవ్వైన యళుకుతో - నిటునటు జూచుకొంటూ
ముచ్చువలె వచ్చె నామురవైరి యపుడు.

వ. ఇవ్విధంబున వచ్చిన యచ్చుతునితో హెగ్గడియ లే మనుచున్నారు.

దరువు—గౌడిపంతు—ఆది.

సమయము గాదయ్యా! ఓయయ్యా! - సమయము గాదయ్యా!
సమయము గాదయ్యా! సంపంగిమన్నారు! - క్రమముగాదు నీ వాకలికియింటికి బోవయ్యా! 1

సత్యభామమ్మ గుణము సారెకు దెలిసియుండి - నెత్తమాడవచ్చునా నెలఁతయింట నుండి
బత్తి నీకెక్కడనో పదవయ్యా! అక్కడికే నీ - జిత్తులు విన్నారు చెలువమన్నారు! 2

పెద్ద మాటేల నయ్యా! పెద్ద మాటేల నయ్యా! - గద్దించే వీ వేళ కలికి గోపాల!
వద్దన్నా మానవు వాదుకు వచ్చేవు - బుద్ది లేదా నీకు పొమ్మంటే రాకు. 3

వ. అప్పు డగ్గజరాజవరదుం డగ్గలిక దప్పి యొక యగ్గడికత్తెతో నేమనుచున్నాఁడు.

పదం - ముఖారి - తెగదమానం.

(శ్రీకృష్ణ): ఏలాగున నున్నది బాలా ఓ - యింతి! తెలుపు మీావేళ
(సఖి): అయ్యా! ఏల? మాటాడేవు చాల చిత్త - మెడసి యున్నది గోపాల! 1

(శ్రీకృష్ణ): నామీాద నేర మింత జూపవే! ఓ - నాయముగ సాక్షి రూపవే అయ్యా!
ఏమైనా తప్పించ నోపవే ఓ - యింతా! యొకరిపై మోపవే. 2

(సఖి): నీ వుండఁగా కొద వేమి ఓ - నీకు నాకెంత పోరామి అయ్యా!
భావజజనక! ఓ సామి! నీవు - బయలుపందిలి బెట్టకుమి. 3

(శ్రీకృష్ణ): నీళ్లు గొట్టితే వేరామెనా ఓ - నిన్నుండి నెనరుబామెనా
కాళ్లవేళ్ల బెనఁగ సేయనా ఓ కలవి లేనివి యెగపోయినా. 4

1. "తలుపు" అని యుండ నోపు.

వ. ఈ రీతి చేర నియ్యని యరాలచికురం నిరాకరించి యామరాళగమన గుఱించి పంచ సాయకగురుం డే మనుచున్నాఁడు.

దరువు - సౌరాష్ట్ర - ఏకతాళి.

(శ్రీకృష్ణ) : ఏమేమే ! వాకిలి దెఱవవే యింటిలోపలికి వచ్చేనే
(సత్య) : ఈ మొగమెఱుఁగని చీఁకటిలోపల నిందెందు వచ్చేవోయి !

పదం.

(శ్రీకృష్ణ) : ఆదిరూపుఁడనే యతివరో ! నేను వాదు లేటికి నన్నాదరించవే
(సత్య) : ఆదిరూపుఁడవు గనుక యాయింతి దృష్టివలల - మోదమున తగిలితి వౌర ! 1
(శ్రీకృష్ణ) : తామేలువాఁ డని దయసేతు [1]నిప్పుడు - కోమలి ! నేఁ డింత కోప మేలే ?
(సత్య) : తామేలువాఁడవు గనుక తరుణిపాదంబులు వేమారు గొలిచితివో మన్న ! 2
(శ్రీకృష్ణ) : నరసింహుఁ డందురు నాతిరో ! నన్నేలు
విరస మేలే ? నిన్ను వేడెదను సత్య! విరసమేలే ? నిన్ను వేడెదను
(సత్య) : నరసింహుఁడవు గనుక నడమంతరము చెలిమి
మెరయించితివా తరుణికిని. 3
(శ్రీకృష్ణ) : అభిరామమూర్తివి యందు రాదరమ్మున నీ
విభుఁడైన మన్నఁడనే వెలఁది ! నేను
(సత్య) : అభిరామమూర్తివి గనుక అతివలు గోరుదురా ! ఒక్క
ఇభరాజగమనకు హితవైతివి. 4
(శ్రీకృష్ణ): మన్నారుదాసుని మానసపూజలను - చెన్నొందువాఁడనే చెలియ !
(సత్య) : మన్నారుదాసుని మానసాంబుజమున - వెన్నుఁడ ! ఉందాము వేడుకను. 5

వ. అప్పు డప్పరమపురుషుండు లబ్ధావకాశుండై బద్ధాదరంబున [2]వడిగ గడియ దీయించి చేరిక జేరి యా నారీమణిని నే మని వేడుకొంచున్నాఁడు.

యదుకులకాంభోది - ఏకతాళి

ఏమే ఓ మెలనాగ ! - నామీఁద దయనుంచి నన్నేలవే.

---

1. విప్పుడు 2. వడిగె.

పదం.

బాలరో! మాటలాడ - వేల? కోపము సేయ
వేళా? నన్నూఱడించి - మేలు జేకోవే!
వాలుగంటి! నీ బంటనై - పాలుపడి యుండఁగ
లాలించి బిగికౌఁగిలి - బాలించ రాదా! 1

తావి మించిన కావిమోవిపానక మిచ్చి - నీవి నన్నంటనీవు నీ విపు డేమే!
నావిన్నప మాదరించి నన్ను గారవించి నీ - సేవకునిచేత సేవ సేయించుకోవే! 2

ప్రేమమీరఁగ సత్య - భామ! ఊరక యిక
తామసము సేయక - నామనవి చేకోవే! నీకు
నామీఁ దాన యూఱకున్న - మోము మోమున జేర్చి
కామునికేళి నేలి - కరఁగించ రాదా! 3

వ. అని శౌరి కూరిమి గొసరి యా నారీమణితో మఱియు నేమనుచున్నాఁడు.

దరువు - యదుకులకాంబోది - రూపకం.

ఎన్నడు నిన్నెడబాయనే - యేయింతి నీసరి సేయనే
వన్నెలాఁడి నీమాట తోయనే - యెన్నరాని మోహా మాయనే

పదం.

వలపు నీవింత దాఁతురా! వలపించి నన్నింత యేఁతురా!
వలరాజుబారి దోతురా! - వనిత! చలము సేతురా!
నీపాదములకు మొక్కితినే! - నే నీవలల జిక్కితినే!
నీరూపము జూచి సొక్కితినే! - యేపొద్దు నే నీకు దక్కితినే!
సంపంగిమన్న! రారా - యని సారెకు నను గూడి తౌర!
సొంపు నన్నేఁచేది మేరా - సుదతి! నీకిది తీరా!

వ. ఆసమయంబున విజయసారథి తన వినయంబు ప్రణయంబువలె నుండిన నెయ్యంబున నయ్యంబుజాక్షికి కైసేసె నట యెటువలెను.

మధ్యమాది - ఝంప.

కురు లమర దిద్దు మది - కొాద వెల్ల దిద్దఁగ
అరవిరులు జుట్టు రతి - నలయించ జుట్టఁగ
మేన కాకలు దీర్చు - మెరమెరలు దీర్పఁగ
చానమై [1]గై సేయు - సల్లాము [2]సేయఁగ

వ. ఇవ్విధంబున కనకవనీవినేత కైతవోపచారంబులు సేయఁ గనుంగొని యమ్మానినీమణి యే మని దూరుచున్నది.

ద్వి. నలినాక్షిని కాన నన్నంట రాకు - కలికిమాటల నీవు గరఁగించ నేర్తు
ఏమాయ లీజాల మీనేర్పు లోరి ! చామలమీఁదనా చాలించఁ గదర
అతివల వలపించి నట్లుండ వలదె ! - చతురత నన్నిట సంపంగిమన్న !
నీకెట్టు హృదయ మేనెలఁత గావలెను - నాకాంత నీకు నే నమరింతు నయ్యా !
విచ్చేయవయ్యా ! మీపిడిదింటి చాయ - వచ్చి పొద్దాయె నో వసుదేవతనయ !

వ. అనిన విని యాకనకాంగినిం గనుంగొని యతిదైన్యంబున పాంచజన్యధరుం డే మనుచున్నాఁడు.

ద్వి. నాతిరో ! యిన్నేల నన్నేల వేలె ? - ఈతీరు కోపంబు నే నోర్వఁజాల
ననవింటిబోయకు నన్నొప్పగించి - [3]నెనరు దప్పించుట నెలఁత ! నాయంబె
పడుచుల మాటలే పథ్యమై తోఁచెఁ - బడఁతి ! నామాట దబ్బర సేసి తిపుడు
ముదిత ! నీకే యింతమోడై తె[4]యల్ల - మదనుండు చుట్టమా మనవి ! జేకోవె

వ. అని(న) నాచంద్రముఖి యభిముఖియై తనలోనె గొణఁగుచు [5]పతిగుణంబు లుపహాసించి యేమనుచున్నది.

దరువు - రేవగుప్తి - ఆది.

రసికుఁడ పొదువు లేర రాజమన్నారు !
పసులగాపరికి దెలుసునా పడఁతుల మేర

---

1. గై సేసు. 2. సేసుఁగ. 3. నెనరు దప్పించుట నాయంబె నెలఁత. 4. యెల్ల. 5. నతి.

వ. అప్పు డాశౌరి కొంతదారికి వచ్చె నని యామిటారికి మ్రొక్కిన క్రమ మెటువలెను.

దరువు - కేదారగౌళ - జంపతాళం.

మొక్కేను మొక్కేనే నీపాదములకు - మొక్కేను మొక్కేను
జక్కవగుబ్బెత ! సత్యభామ నీకు - మొక్కేను (మొక్కేనే)

వ. ఆ సమయంబున ధాత్ర్యంశావతీర్ణయగు నాసాత్రాజితీసతి యంతరంగంబున నెంతయు సంతసిల్లి పంతంబు చెల్లె నని కంతుజనకుని కౌఁగిట నుంచి గారవించి యే మనుచున్నది.

దరువు - ఎదుకులకాంబోది జ ఆది.

పంతము జెల్లె గదర ! నీవు నా - బంటవైతివి గదరా !
కంతుజనక ! నిన్ను - కౌఁగిట గారవించెదర !

వ. ఇవ్విధంబున సుత్రామసహోదరుండు సాత్రాజితీదేవిని జోడుగూడి నటించె నట యెటువలెను.

దరువు - కల్యాణి - ఏకతాళి.

సత్యభామను గూడి సంపంగిమన్నారు - అత్యాదరంబున నాడె వేడుకను.

వ. ఇటువలె నటించిన సత్యారాజ [1]గోపాలకుల నత్యంతశృంగారంబు నత్యంతమోదంబున జూచి యత్తరి యొక బిత్తరి యే మనుచున్నది.

సౌరాష్ట్ర - అటతాళం - పల్లవి.

అలుక దీరె నటే ! మీయిద్దఱి - యలుక దీరె నటే !
కులుకు గుబ్బల గురుతు లున్నవి.

పదం.

మొక్కళంపు మోహాన మొక్కి వేడుకొంటివో !
సొక్కి యాతఁడె నీకు సొమ్ము లిచ్చెనో !
యిక్కువ నెదురెదురై యే మాడుకొంటిరో !
చక్కని మన్ననారు చలముమాని మేలైన చనవు లొసంగెనో ! 1

1. గోపాలకులరత్యంత.

పడకింటికి రమ్మని పదములు బట్టుకొంటివో !
పడుచ రమ్మని మోవిపై పలుగెంపు లుంచెనో !
కడువేడుక యతఁడు మెచ్చ గళరవము లొసఁగితో !
పడతి ! నిన్ను మన్ననారు పయ్యెద బట్టి హారువుగా పక్క నుంచెనో ! 2

విరులశయ్యపై నుండి విడె మొ(సం)గితివో !
సరులు కొప్పున జుట్టి సంప(ంగి) మన్నఁడు
కరుణించి మరుకేళి కవగూడి నిన్నేలెనో !
.......................మగువపై కొంటివో !
మీరిద్దఱు సరిపెనఁగితిరో ! 3

వ. ఇవ్విధంబున (సు)ధర్మామధ్య (సింహాసనంబున) నధ్యా(సీనుం)డై యరుణాబ్జనాయికా .............. లు తనపదములు గొలువ నిండుగొలువుండి చెన్నారు చెలువ మన్నారుపైఁ దెఱగంటిదొరలు విరులవానలు గురియించి రట యెటువలెను.

దరువు - పాడి - ఏకతాళి.

పొంగుచు గురిసేరు పువ్వుల వానలు
చెంగమ్మ విభునిపై జేజేల దొరలు.

వ. ఆసమయంబున నంగజగురునిచెంగట మెఱుంగుఁబోణు లిద్దఱు మంగళప్రదంబుగా నటించి రట యెటుపలెను.

దరువు.

మన్నారుదేవునికి మంగళం.

వ. ఇవ్విధంబున జగన్నాటకసూత్రధారులైన యరుణాబ్జనాయికా రాజగోపాలకులు తమ పదంబుల కంకితంబుగా శృంగారరసశృంగాటకంబగు కృష్ణవిలాసనాటకము హావణించి హెచ్చిన యచ్చుతవిజయరాఘవ సార్వభౌమునకు ఆయురారోగ్యంబు లఖిలసామ్రాజ్యాధిపత్యంబు సారసారస్వతసిద్ధియు సత్సంతానాభివృద్ధియు జగత్ప్రసిద్ధియు బాలించి రక్షింతురు గాత !

శ్రీ కృష్ణవిలాసనాటకము సంపూర్ణము
శ్రీరామచంద్రాయ నమః